RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :193 EDITOR: CHERUKU UPENDAR, DATE : TUESDAY 28 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-


రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 193 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 28 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1వ తేదీ ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇస్తున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈనెల 29, 30 తేదీల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి ఈ సెలవు వర్తిస్తుందని ఆయా జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. .

మిగతా 2లో




## గ్రేటర్‌లో మోడీ రోడ్‌షో

### - ప్రధాని పక్కన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్



హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ రోడ్‌షోను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, వైఎంసీఏ మీదుగా కాచిగూడ క్రాస్‌రోడ్డు వరకు రోడ్‌షో చేపట్టారు. ప్రధాన వాహనంలో ప్రధాని పక్కన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. గ్రేటర్ పరిధిలో పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ ర్యాలీలో జనసేన, ఎమ్మార్పీఎస్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. రోడ్‌షో పొడుగుతా మోడీకి ఆ పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. రోడ్‌షో ముషీరాబాద్, ఖైరతాబాద్,

మిగతా 2లో

# ఏఐజేఎస్‌తో సత్వర న్యాయం

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచన



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

అఖిల భారత న్యాయ సర్వీసులు (ఎఐజెఎస్) రూపకల్పన చేస్తే న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడానికి అది ఒక మార్గంగా మారుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. యువ న్యాయనిపుణుల్లో ప్రతిభ, పోటీతత్వం, పారదర్శకతను పెంపొందించడానికి కూడా దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. ఎఐజెఎస్‌ను ఏర్పాటు చేయాలని సూచిస్తూ దాని ప్రాధాన్యతను ఆమె వివరించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టు ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో న్యాయ వ్యవస్థకు ఉన్న ప్రాముఖ్యత అద్వితీయమైనది పేర్కొన్నారు. బెంచ్ అండ్ బార్‌లో అన్ని

మిగతా 3లో

## ఫామ్‌హౌస్ పాలన వద్దు..!

### కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ



మహబూబ్‌నగర్- - ప్రభాత సూర్యుడు

"బీఆర్ఎస్, బీజేపీల చిన్నతమ్ముడు ఎంఐఎం.. ఆ దోస్తానితోనే ఎంఐఎం 9 సీట్లలోనే పోటీ చేసింది.. ఫామ్‌హౌస్ పాలన మనకొద్దు.. ప్రజా పాలన కావాలి.. భూములను కబ్జా చేసే బీఆర్ఎస్‌ను ఓడించాలి.. లౌకిక దారుల్లో నడిచే కాంగ్రెస్‌ను గెలిపించండి" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ అన్నారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, కోస్గి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచార సభలు, రోడ్‌షోల్లో ప్రియాంకగాంధీ ప్రసంగించారు. భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా

మిగతా 2లో

## వ్యవసాయ సంక్షోభమే ప్రధాన రాజకీయ సమస్య

### నేడు రాజ్ భవన్‌లకు రైతులు, కార్మికుల మార్చ్

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశంలో వ్యవసాయ సంక్షోభం జాతీయ స్థాయిలో ప్రధాన రాజకీయ సమస్యగా మారిందని మహాపడవ్ స్పష్టం చేసింది. కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక, కర్షక, ప్రజా, దేశ వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్ర రాజధానుల్లో రాజ్ భవన్ (గవర్నర్ కార్యాలయాల)ల ఎదుట రెండో రోజు సోమవారం మహాపడవ్ కొనసాగింది. ఇందులో లక్షల

మిగతా 2లో



## ఘనంగా భారత భాగ్య సమృద్ధి యజ్ఞం

### - హాజరైన తెలంగాణ గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్

సుల్తాన్ బజార్ - ప్రభాత సూర్యుడు

భాగ్యనగరంలోని సీతారాంభాగ్ లో ఉన్న పురాతన శ్రీరామ మందిరంలో 45 రోజుల పాటూ నిర్వహించిన భారత భాగ్య సమృద్ధి యజ్ఞం యొక్క పూర్ణాహుతి కార్యక్రమానికిముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళ సై సౌందర్య రాజన్ హాజరై మాట్లాడుతూ.. చిన్నారులకు ఆధ్యాత్మికత మార్గం చూపించాల్సిన అవసరం ఉంది అన్నారు. భారత భాగ్య సమృద్ధి యజ్ఞ నిర్వహణ ఎంతో మహత్తర

మిగతా 3లో





## 'అయ్యా.. బాంచన్'

# బతుకులు పోవాలి

### కాంగ్రెస్ రోడ్ షోల్లో విజయశాంతి

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు

బీసీలకు సీట్లు ఇవ్వని బీజేపీ.. సీఎంను చేస్తామంటున్నదని కాంగ్రెస్ పార్టీ క్యాంపియన్ కమిటీ ఛీప్ కోఆర్డినేటర్ విజయశాంతి విమర్శించారు. కేసీఆర్, మోడీ ఇద్దరూ కుల రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజలు అయ్యా బాంచన్ అనే విధంగా బతకాల్సి వచ్చిందని, అలాంటి పార్టీని గద్దెదించే అవకాశం వచ్చిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన రోడ్‌షోల్లో ఆమె మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలోని మహంకాళి అమ్మ ఆలయం నుంచి రోడ్ షోలో పాల్గొన్న ఆమె అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడారు. పేదల బతుకులు మార్చేది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌ను రెండుసార్లు గెలిపిస్తే రాష్ట్రాన్ని అప్పులపాలు

మిగతా 2లో

## 30న ఓట్లు పడుడే..

# 3న కారు గెలిచుడే..!

### - షాద్‌నగర్, చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

షాద్‌నగర్- ప్రభాత సూర్యుడు

'కేసీఆర్ బతికుండగా రైతుబంధు ఆగుద్దా.. రైతుబంధు డబ్బులివ్వొద్దని కాంగ్రెసోళ్లు కుట్రలు చేసి ఆపింద్రు. న్యాయ పోరాటం చేస్తే 28న ఇచ్చేందుకు ఈసీ అనుమతిచ్చింది. ఇంతలో మరో కాంగ్రెసోడు మళ్లీ ఫిర్యాదు చేసి ఆపిండు. ఇట్ల ఎన్ని రోజులు ఆపుతరు. 30న ఓట్లు పడుడేనాయే.. 3న కారు గెలుచుడేనాయే.. 6న రైతుబంధు డబ్బులిచ్చుడేనాయే.. దాంతోపాటు అసైన్డ్ భూములకు పట్టాల కోసం తొలి సతకం చేస్తా..' అని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఓటు మన తలరాతను మార్చుతుందని, వచ్చే ఐదేండ్లు మనందరి భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటేనని అందోల్, సంగారెడ్డి సభల్లో సీఎం చెప్పారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలతోపాటు ఆయా పార్టీల చరిత్రను కూడా చూడాలన్నారు. రైతు బంధు దుబారా ఖర్చు అని చెబుతున్న కాంగ్రెసోళ్లు ఈసీకి ఫిర్యాదు చేసి రైతులకు డబ్బులేయకుండా చేశారన్నారు. న్యాయ పోరాటం చేసి ఈసీ అనుమతి






తెచ్చుకుంటే మళ్లీ వాళ్లే ఫిర్యాదు చేసి డబ్బులివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఇట్ల ఎన్ని రోజులని రైతుబంధును ఆపుతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ గెల్వంగనే డిసెంబర్ 6న టింగ్ టింగ్‌మని రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం సక్కగుంటే ఎన్టీఆర్ పార్టీ ఎందుకు పట్టేవారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రమంతా ప్రశాంతంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సాగిన రక్తపాతం మళ్లీ కావాల్నా అని ప్రశ్నించారు. దేశంలో 158 మెడికల్ కళాశాలు ఇచ్చిన బీజేపీ.. తెలంగాణకు

మిగతా 2లో

## డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడి యట్, కళాశాల, సాంకేతిక విద్యాశాఖలతో పాటు ఇతర శాఖలకూ వర్తిస్తుందనీ, ఆయా విభాగాధిపతులు దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాలు ఫాలో కావాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న విద్యాసంస్థలకు ఈనెల 29, 30 తేదీల్లో సెలవులు ప్రకటించారు

## గ్రేటర్‌లో మోడీ రోడ్‌షో

(మొదటిపేజీ తరువాయి)

అంబర్‌పేట నియోజకవర్గాలను టచ్‌చేసేలా సాగింది. కాచిగూడ చౌరస్తాలోని సావర్కర్ విగ్రహంపై ప్రధాని మోడీ పూలు చల్లి నివాళి అర్పించారు. గ్రేటర్ పరిధిలో పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థులు, బీజేపీ రాష్ట్ర నాయకులను పలుకరించారు. అనంతరం ఇందిరాపార్కులో నిర్వహిస్తున్న కోటిదీపోత్సవ పరిసమాప్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నేతల ప్రదర్శనలు..ప్రజల ఇక్కట్లు..**

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఒకే రోజు బీజేపీ బీఆర్‌ఎస్ పార్టీలు రోడ్‌షోలు, సభలు పెట్టడంతో ఆయా రూట్లలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఉదయం నుంచే హిందీమహా విద్యాలయ-ఇందిరాపార్కు రూట్, సికింద్రాబాద్ టూ కోఠి, సికింద్రాబాద్ టూ బషీర్‌బాగ్, బర్కత్‌పుర నుంచి నారాయణగూడ వెళ్లే రూట్లలో పోలీసలు ఆంక్షలు పెట్టడం, వాహనాలను వెళ్లనీయకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి పహారాలో ఉన్న పోలీసులు వాహనదారుల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చేసేదేమి లేక తమ డ్యూటీకి సహకరించాలని కోరారు.

## వ్యవసాయ సంక్షోభమే ప్రధాన రాజకీయ సమస్య

(మొదటిపేజీ తరువాయి)

మంది కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు. వివిధ ప్రజా సంఘాలు సంఘీభావంగా నిలిచాయి. కార్మికులు, రైతు ఐక్యత మోడీ సర్కార్ కార్పోరేట్, మతపరమైన బంధాన్ని సవాలు చేసింది. డిమాండ్ల చార్టర్‌ను గవర్నర్‌కు సమర్పించేందుకు నేడు (మంగళవారం) రైతులు, కార్మికులు రాజ్‌భవన్‌లకు మార్చ్ చేయనున్నారు.

**దేశ చరిత్రలో మొదటిసారి**

వేలాది మంది రైతులు, కార్మికులు ఆందోళన చేసే దగ్గరే వంటావార్పు చేశారు. మహాపడవ్ సైట్‌లో ట్రాక్టర్ ట్రాలీలు, తాత్కాలిక టెంట్‌లలో రాత్రి బస చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో కార్మికులు, రైతుల ఐక్యతకు రాజకీయ ప్రాధాన్యతనిస్తూ ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్ర రాజధానుల్లో మహాపడవ్ కొనసాగింది. నిర్దిష్ట డిమాండ్ చార్టర్, కార్యాచరణ ప్రణాళికతో కార్మికులు, రైతుల వేదికల కలయిక స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా జరుగుతోంది.

**వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాలి**

కార్మికులు, రైతుల వేదికల అఖిల భారత నాయకులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దీర్ఘకాలిక వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పేద రైతాంగం, గ్రామీణ శ్రామిక ప్రజానీకం, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ వలసలను పరిష్కరించాల్సిన అవసరంపై దృష్టి పెట్టాలన్నారు. నయా ఉదారవాద విధానాలు వ్యవసాయ సంక్షోభానికి మూలమని విమర్శించారు. వ్యవసాయ సంక్షోభం, సంబంధిత వ్యవసాయ కార్పొరేటీకరణ విధానం అఖిల భారత స్థాయిలో ప్రధాన రాజకీయ సమస్యగా మారాయన్నారు. అందువల్ల, రాబోయే రోజుల్లో ప్రతి కార్మికుడు, రైతు అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి ప్రచారం, పోరాటాలు మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.

## 'అయ్యా.. బాంచన్' బతుకులు పోవాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారని ఆరోపించారు. కేసీఆర్, మోడీ మధ్య రహస్య ఒప్పందముందన్నారు. అందుకే కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కామ్‌లో కేంద్రం అరెస్టు చేయకుండా వెనకడుగు వేసిందని విమర్శించారు. వీరిద్దరిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని తాను గ్యారంటీ అని బాండ్ పేపర్‌పై మల్‌రెడ్డి రంగారెడ్డి సంతకం చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, నాయకులు గౌస్‌పాషా తదితరులు ఉన్నారు.

**'అయ్యా.. బాంచన్' బతుకులు పోవాలి.**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆర్మూర్‌ల్లో జరిగిన రోడ్‌షోల్లో విజయశాంతి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ను గద్దె దించి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. వేల కోట్ల రూపాయలను సంపాదించుకుంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను బిచ్చగాళ్ళగా మార్చిందని, తెలంగాణ సంపదలను పందికొక్కులుగా దోచుకుంటున్నారని అన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా పాలనను అందించే కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యంపై ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు దిగుతూ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ఈడీ దాడులు జరుగుతున్నారని, బీఆర్‌ఎస్ నేతలపై ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. సంక్రాంతికి 500 రూపాయల సిలిండర్‌తో ప్రతి ఒక్కరూ తమ అప్పాలు చేసుకోవాలని అన్నారు. తెలంగాణలో యువతను గంజాయి వైపు మార్చిన ఘనత అధికార పార్టీది అని, బాల్కొండ నియోజకవర్గంలో యువత గంజాయి వైపు మారేలా చేసిన మంత్రిని ఓడిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని అన్నారు.

# ఫామ్‌హౌస్ పాలన వద్దు..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను ఉద్దేశి ప్రియాంక మాట్లాడుతూ.. రెండు సార్లు అధికారం ఇస్తే బీఆర్‌ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, అవినీతి ఆకాశాన్నం టిందని చెప్పారు. మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరు, మధ్యతరగతి వ్యాపారులు అనేక అవస్థలు పడ్డారని తెలిపారు. యువజనుల ఆశలు నెరవేరేలేదని, వారి కలలు సాకారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే భూమాఫియా పెరిగిపోతుందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా, రింగ్ రోడ్డు వేలంపాట ద్వారా అవినీతికి శ్రీకారం చుట్టారని ప్రియాంకగాంధీ విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీపై ఎంఐఎం నేతలు తల తిక్క ఆరోపణలు చేస్తున్నారని, కానీ, రాహుల్ ప్రజల్లో ఒక శక్తిగా ఎదిగారని చెప్పారు. దేశ ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు ఆయన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు.

**లౌకిక మార్గాన నడిచే కాంగ్రెస్‌ను గెలిపించండి..**

కులమతాలకతీతంగా పరిపాలన అందించే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రియాంక గాంధీ పిలుపునిచ్చారు. గద్వాల, కోస్గి నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల ప్రచారంలో ఆమె ప్రసంగించారు. ప్రాజెక్టులలో అవినీతి, కమీషన్ల పరాకాష్టకు చేరడం వల్లేనాసిరకమైన పనులతో కాళేశ్వరం కుంగి పోయిందన్నారు. ప్రధాని మోడీ పేదల భూములను, డబ్బును అదానీ వంటి పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలకు మోడీ పాలనలో ఉపాధి కరువైందన్నారు. ఎన్నికలకు ముందు మాయ మాటలు చెప్పే నాయకులను తిరస్కరించాలని ఆమె ఓటర్లను కోరారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్‌కు ఎవరూ సాటిరారన్నారు.

# 30న ఓట్లు పడుడే.. 3న కారు గెలిచుడే..!

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. అలాంటి బీజేపీకి ఓటు ఎందుకు వేయాలన్నారు. బీజేపీకి వేసే ఓటు మోరీలో వేసినట్లే అవుతుందన్నారు. సంగారెడ్డి జిల్లాలో తలాపున సింగూరున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో అందోల్, సంగారెడ్డికి తాగు, సాగునీరు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతిని గెలిపిస్తే నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద దళితులందరికీ ఒకేసారి దళితబంధు అమలు చేస్తామన్నారు.సంగారెడ్డిలో పోలింగ్ బూతుల్ని ఆక్రమించి రిగ్గింగ్ చేసే ఎమ్మెల్యే కావాల్నా ఓడిపోయినా ప్రజల మధ్య ఉండి సేవ చేస్తున్న చింత ప్రభాకర్ కావాల్నా ఆలోచించుకుని ఓటు వేయాలని కోరారు. సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటిస్తామన్నారు.

**అసైన్డ్ భూముల పట్టాలకు తొలి క్యాబినెట్‌లోనే ఆమోదం**

అసైన్డ్ భూముల పట్టాలను రాబోయే బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలి క్యాబినెట్ భేటీలోనే ఆమోదిస్తామని షాద్‌నగర్, చేవెళ్ల సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని, అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించి గెలిపించాలని కోరారు. షాద్‌నగర్ వరకు మెట్రో విస్తరిస్తామన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 111జీఓ రద్దు చేశామని, హైదరాబాద్ చుట్టూ మాస్టర్ ప్లాన్ చేయాల్సి ఉందని, అది కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 'నేను అందరికీ అర్డర్ వేస్తే.. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాత్రం నాకు అర్డర్ వేస్తాడు. నా దగ్గరికి రాగానే ఏం ఆర్డరో చెప్పు అని అంటా' అని సీఎం వ్యాఖ్యానించారు.

# శాంతిసామరస్యాలను చెడగొడుతున్న బీజేపీ



కంఠేశ్వర్- ప్రభాత సూర్యుడు

పంటలు చేతికొచ్చే సమయంలో మిడతల దండు వచ్చినట్టు.. ఐదారు రోజులుగా ఢిల్లీ నుంచి బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు తెలంగాణపై పడుతున్నారు.. ఓట్లతో ఆ మిడతల దండు పని పట్టాలి.. అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన నాడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు ఆంధ్రా హక్కుల గురించి మాట్లాడారు కానీ తెలంగాణ హక్కు గురించి మాట్లాడలేదని తెలిపారు. తెలంగాణలోని 7 మండలాలను అప్రజాస్వామికంగా ఆంధ్రలో కలిపినప్పుడు, కేంద్రం విభజన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులకు మాట్లాడటానికి నోరు రాలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటును అవహేళన చేస్తూ పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడినప్పుడు సోనియా గాంధీ అక్కడే ఉన్నా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. బీజేపీ అబద్దాలు చెప్పడం తప్ప ఒక్కసారి కూడా నిజం చెప్పలేదని విమర్శించారు. తెలంగాణలో శాంతి సామరస్యాలను పాడుచేయడానికి ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరు భాగ్యలక్ష్మి దేవాలయం అంటారు.. మరొకరు భైంసాకు వెళ్లి ఏదో చేస్తామంటారు.. కానీ మనకు భరోసా, భద్రత ఇచ్చేలా, అస్థిత్వాన్ని కాపాడటానికి ఏనాడూ బీజేపీ ప్రయత్నం చేయలేదని అన్నారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని నాయకులు, పార్లమెంటులో పెదవి విప్పని నాయకులు, అవసరమున్నప్పుడు తెలంగాణకు నయాపైసా ఇవ్వని వాళ్లు మనకు అవసరమా అన్నది ఆలోచించాలని ఓటర్లను కోరారు. మతం పేరు చెప్పి మంటలు పెట్టాలని ఒక పార్టీ చూస్తోందని, మరొక పార్టీ కులం పేరు చెప్పి కుతంత్రం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే.. ముస్లింలకు ఎంత నష్టం జరుగుతుందో.. హిందువులకూ అందే నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ఆలోచన లేక కొన్ని పార్టీలు ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. మంచోళ్లు కావాలా ముంచేటోళ్లు కావాలా అన్నది తేల్చుకునే సందర్భం వచ్చిందన్నారు. రైతుబంధు నిధులను కాంగ్రెస్ పార్టీ వెంటబడి మరీ నిలిపివేయించిందని, రైతుల నోటి కాడి బుక్కను లాక్కొని ఆ పార్టీ రైతు వ్యతిరేకతను చాటుకుందని అన్నారు.

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్.. తెలంగాణలో బుల్డోజర్ నడపాల్సిన సమయం వచ్చిందని అంటున్నారని, వెయ్యి బుల్డోజర్లు నడిపినా వాటిపై దాడి చేయడానికి కారు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. "బుల్డోజర్లు నడపడం మా ఆలోచన కాదు. పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలన్నదే మా ఆలోచన. సాగు, తాగు నీళ్లు అందించాలన్నది, పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్నది మా ఆలోచన. మీ లాగా ఇండ్లను కూల్చేయడం కాదు.. ఇండ్లు నిర్మించడం మా ఆలోచన" అని చెప్పారు.

### ఆరునూరైనా

# డిసెంబరు ఆరున ఖాతాల్లో డబ్బులేస్తాం

**- రైతుబంధు నిలిపివేతపై మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు



ఆరు నూరైనా డిసెంబరు ఆరున అన్నదాతల ఖాతాల్లో రైతు బంధు డబ్బులేస్తామని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతల ఫిర్యాదు వల్లే రైతు బంధును ఎన్నికల సంఘం ఆపిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రకంగా ఆ పార్టీ రైతు నోటి కాడి ముద్దను ఎత్త గొట్టిందని (లాక్కోవటం) వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లతో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్షనేత కె.కేశవరావుతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. రైతు బంధు పథకాన్ని ఆపాలంటూ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే అక్టోబర్ 23న ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ పథకం పాతదే కాబట్టి బీఆర్‌ఎస్ అభ్యర్థన మేరకు తొలుత ఈసీ అనుమతించిందని అన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్ మరోసారి ఫిర్యాదు చేయడంతోనే ఈసీ ఇప్పుడు రైతు బంధును ఆపిందని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రైతు బంధు స్కీం ఆగబోదన్నారు. బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 6న రైతుల ఖాతాల్లో నిధులను జమ చేస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ మొదటి నుంచి రైతు వ్యతిరేక పార్టీ అని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడుగానీ, ప్రతి పక్షంలో ఉన్నప్పుడుగానీ అన్నదాతల పట్ల ఆ పార్టీ సానుకూలంగా వ్యవహరించలేదని దుయ్యబట్టారు. పీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రస్తుత అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మీడియా సమావేశాల్లో రైతు బంధుపై విషం కక్కారని గుర్తు చేశారు. ఆ పథకం దుబారా ఖర్చని ఒకరంటే, రైతులకు బిచ్చమేస్తున్నారా? అంటూ మరొకరు విమర్శించారని తెలిపారు. మోసపూరిత వాగ్దానాలతో కర్ణాటకలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు అబద్దపు ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. ఆ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న రూ. 4 వేల రైతు సాయాన్ని రద్దు చేయడంతోపాటు కరెంట్ కోతలు, స్కాలర్‌షిప్పులపై ఆంక్షలు పెట్టిందని విమర్శించారు. నాలుగు గంటల కరెంటు చాలంటూ ఒకరంటే, మీటర్లు పెడుతామంటూ మరొకరు రైతులను భయపెడుతున్నారని చెప్పారు.

# ఏఐజేఎస్‌తో సత్వర న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక తరగతుల వారికి అవకాశం కల్పిస్తే సరైన న్యాయం అందించడం సాధ్యమవు తుందన్నారు. ఎఐజెఎస్ ఏర్పాటుతో మరింత మెరుగైన న్యాయాన్ని అందించేందుకు తోడ్పడుతుందన్నారు. ప్రతిభావంతమైన యువతను దీనికి ఎంపిక చేసి న్యాయమూర్తులుగా తీర్చి దిద్దవచ్చునని తెలిపారు. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు యువ న్యాయవేత్తల ప్రతిభను పెంపొందించగలదని ఆమె పేర్కొన్నారు.

# ఘనంగా భారత భాగ్య సమృద్ధి యజ్ఞం

(మొదటిపేజీ తరువాయి)

కార్యంచేపట్టినమాధవిలతనుఅభినందించారు.భాగ్యనగరంలోని సీతారాం భాగ్ లో ఉన్న ప్రాచీన శ్రీరామ మందిరంలో ఆక్టోబర్ 15 నుండి 27 నవంబర్ వరకూ 45 రోజుల పాటూ నిర్వహించిన భారత భాగ్య సమృద్ధి యజ్ఞం సోమవారం ముగిసింది. 45 రోజుల పాటూ నిర్వహించబడిన ఈ మహత్తర యజ్ఞ సందర్భన సందర్భంగా తెలంగాణా రాష్ట్ర ప్రజలందరూ ఆనందంగా ఉండాలని శివున్ని ప్రార్థిస్తున్నట్లు, ఈ సందర్భంగా యాగ నిర్వాహకురాలు మాధవి లత చెప్పారు, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాలలో యాగ నిర్వాహకులు మాధవి లత కొంపెల్ల, ఛైర్మన్, లోపముద్ర ఛారిటబులే ఫౌండేషన్ తో పాటూ నిర్వాహక మండలి సభ్యులు యమన్ సింగ్, ప్రమోద్ కుమార్, ఆర్ యల్ యన్ రావు, పలువురు కార్యకర్తలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా విధులు నిర్వహించాలి

**-పోలింగ్ రోజు 144 సెక్షన్ విధించాలి**

**- కేంద్ర ఎన్నికల స్పెషల్ పోలీస్ అబ్జర్వర్లు విజయ్ సింగ్ మీనా, వినీత్ కన్నా**




**నల్గొండ - ప్రభాత సూర్యుడు:** శాసన సభ సాధారణ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకొనేల తమ విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి కేంద్ర ఎన్నికల స్పెషల్ పోలీసు అబ్జర్వర్ లు విజయ్ సింగ్ మీనా, వినీత్ ఖన్నా సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కేంద్ర ఎన్నికల పోలీసు అబ్జర్వర్ లు విజయ్ సింగ్ మీనా, వినీత్ ఖన్నా, జిల్లా ఎస్పి.అపూర్వ రావు తో కలిసి కేంద్ర పార మిలటరీ బలగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ ల వద్ద శాంతి భద్రతలు భంగం కలగకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క పోలింగ్ బూత్ దగ్గర ప్రతిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, పోలింగ్ బూత్ కు 100 మీటర్ల వెలుపలనే వాహనాలను ఆపే విధంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ రోజున ఎక్కువ మంది ఒకే చోట గుమి కూడకుండా 144 సెక్షన్ విధించాలని అన్నారు. అదనపు బలగాలను రిజర్వులో ఉంచుకోవాలని, ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు అత్యవసర సమయంలో వినియోగించుకోనెలా సిబ్బంది ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా యస్.పి అపూర్వరావు మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించుటకు తీసుకున్న బందోబస్తు చర్యలను, చెక్ పోస్టుల పనితీరును, జిల్లా లో ఉన్న వల్నరబుల్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ఏర్పాటు చేసిన రూట్ మొబైల్స్ వివరాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో తీసుకుంటున్న చర్యలను, కమ్యూనికేషన్ వివరాలు, కౌంటింగ్ కేంద్రంలో బందోబస్తు, పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్,ఇవిఎం యంత్రాల సెక్యూరిటీ తదితర ఏర్పాట్ల గురించి అధికారులకు వివరించారు.

# తెలంగాణలో ‘రైతుబంధు’కు ఇసి బ్రేక్

**కోడ్ ముగిసేవరకు నిధులు విడుదల చేయవద్దని ఆదేశం**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ శాసనసభ ఎన్నికలకు మూడు రోజుల ముందు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) కీలక నిర్ణయం తీసుకుంది. ‘రైతు బంధు’ సాయం పంపిణీకి రెండు రోజుల క్రితం ఇచ్చిన అనుమతిని సోమవారం ఉపసంహరించుకుంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసేవరకు నిధులు విడుదల చేయవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు సిఇసి ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 28లోపు రైతుబంధు పంపిణీ చేసేందుకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి ఇసి అనుమతి ఇచ్చింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంత్రి హరీశ్ రావు నియమాలను ఉల్లంఘించినందున ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఎన్నికల ప్రచార సభల్లో రైతుబంధు గురించి ప్రస్తావించరాదని, లబ్ధి పొందేలా వ్యాఖ్యలు చేయొద్దని ముందే ఇసి షరతు విధించింది. అయితే, రైతుబంధుపై మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు ఎన్నికల నియమావళికి విరుద్ధమని పేర్కొంటూ తాజాగా ఇసి అనుమతి రద్దు చేసింది. దీంతో, రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు ‘రైతుబంధు’ సాయం నిలిచిపోయింది. దీనిపై కాంగ్రెస్, బిఆర్ఎస్ పరస్పర విమర్శలకు దిగాయి.

## నేటి సాయంత్రం 5 గంటల నుండి

# డోర్ టు డోర్ ప్రచారానికే అనుమతి

**-నవంబర్ 30న ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి**

**-ఒక్క పోలింగ్ కేంద్రానికి 828 మంది ఓటర్లు**

**-నేటి నుండి 144 సెక్షన్ అమల్లో ఉంటుంది**

**-నేటికీ 50.32 కోట్ల సీజ్**

**-జిల్లా ఎన్నికల అధికారి అర్వి కర్ణన్**

**- నల్గొండ కలెక్టరేట్**



ఈనెల 30న జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు,పోలింగ్ రోజున ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు ను వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ అర్వి.కర్ణన్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లా ఎస్పి అపూర్వ రావు తో కలిసి పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల సైలెన్స్ పిరియడ్ లో డోర్ టు డోర్ తప్ప ఎటువంటి ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు. నేడు సాయంత్రం 5 గంటల నుండి 144 సెక్షన్ అమలు లో వుంటుందని,5 గురు కంటే ఎక్కువ మంది గుమి కూడదం,ప్రచారం చేయడం కానీ చేయరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సభలు,సమావేశాలు,మైక్ ప్రచారం నిర్వహించ వద్దని తెలిపారు. జిల్లాలో 14,64,080 ఓటర్లు ఉన్నారని,పురుష ఓటర్లు 726169 మంది,737789 మంది మహిళా ఓటర్ లు,122మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారని తెలిపారు.543 మంది సర్వీస్ ఓటర్ లు ఉన్నారని,18-19 వయస్సు మధ్య 60840 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.80 కి పైగా సీనియర్ సిటిజన్ లు 17424 మంది, పిడబ్ల్యుడి ఓటర్స్ 32007 మంది,ఓవర్ సీస్ ఓటర్ లు 76 మంది, పోలింగ్ కేంద్రం కు సరాసరి 828 మంది ఓటర్ లు ఉన్నారని తెలిపారు. జిల్లా లో 1766 పోలింగ్ కేంద్రాలు,2 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.1271o1 లొకేషన్ లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు**

ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 5 చొప్పున మహిళా పోలింగ్ సిబ్బంది నిర్వహించే పోలింగ్ కేంద్రాలు ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 30 పోలింగ్ కేంద్రాలు,ప్రతి నియోజకవర్గం లో 5 చొప్పున ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 30 మోడల్ పోలింగ్ కేంద్రాలు,ప్రతి నియోజకవర్గం లో ఒకటి చొప్పున పిడబ్ల్యుడి పోలింగ్ సిబ్బంది నిర్వహించే ఆరు నియోజకవర్గాల్లో 6 పోలింగ్ కేంద్రాలు,ప్రతి నియోజకవర్గం లో ఒకటి చొప్పున అరు నియోజకవర్గాల్లో 6 యువత నిర్వహించే యూత్ పోలింగ్ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 556 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు,దేవరకొండ నియోజకవర్గం లో 13 షాడో పోలింగ్ కేంద్రాలు,మును గొడ్ నియోజకవర్గం లో 9 మొత్తం 22 షాడో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మెడికల్ కిట్, వాలంటీర్స్, ట్రాన్స్పోర్ట్, క్యూ మేనేజ్ మెంట్ ఏర్పాటు చేయనున్న ట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 కోట్ల 32 లక్షల విలువ గల నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన ఆభరణాలు, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు.

గ్రీవెన్స్ కమిటీ ద్వారా నగదు, ఇతర వస్తువులు స్వాదీనం చేసుకున్న 261 కేసులకు సంబంధించి 261 కేసులను పరిశీలించి 34 కోట్ల 39 లక్షల 63 వేల నగదు రిలీజ్ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో,రిటర్నింగ్ అధికారి కార్యాలయం లలో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేసి పిర్యాదులు స్వీకరించి పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు రిటర్నింగ్ అధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుండి వెబ్ క్యాస్టింగ్,వాహనాల ను జి.పి.ఎస్ ద్వారా పర్యవేక్షణ, కమ్యునికేషన్ పి. ఓ, లు, సెక్టార్ అధికారుల మధ్య పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు.

**ఎన్నికల నిర్వహణకు 3079 మంది**

పోలీస్ సిబ్బంది,3 ప్లాటూన్ ల టీ ఎస్ ఎస్ పి,19 ప్లాటూన్ ల సిఏపిఎఫ్ సిబ్బంది విధుల్లో ఉన్నట్లు తెలిపారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 180 రూట్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1211 మంది 80 సం.లు దాటిన వారు,1001 మంది పిడబ్ల్యుడి ఓటర్ లు హోం ఓటింగ్ ద్వారా ఇంటి వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు కున్నారని తెలిపారు. విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బంది 8211 మంది,ఇతర జిల్లాలకు చెందిన వారు736 మంది, మొత్తం 8947 మంది ఫారం 12 సమర్పించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినిగోగించుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గం లో డిఆర్సి సెంటర్ ల నుండి ఈవియంల డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం రిసెప్షన్ నుండి తిప్పర్తి మండలం అనిశెట్టి ధుప్పలపల్లి గోదాం కు పోల్డ్ ఈ వియంలు పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూం లకు తరలింపు చేయనున్నట్లు తెలిపారు.

డిసెంబర్ 4 వరకు 144 సెక్షన్ అమలు

**టోకెన్ విధానంతో మద్యం అమ్మితే చర్యలు**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్.పి.అపూర్వ రావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగుండా పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నవంబర్ 30న పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు శాంతి యుత వాతవారణంలో నిర్వహించడానికి పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఏర్పాటు చేయడం జరిగింది. పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్ ను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీస్ సిబ్బందిని నేడు మధ్మాహ్నం 2 గంటల నుండి తరలించడం ( డిప్లయ్) చేయడం జరుగుతుందని తెలిపారు.నేటి సాయంత్రం 5 గంటల నుండి డిసెంబర్ 4వ తేదీ ( సోమవారం ) ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఈ సమయంలో 5 మంది కంటే ఎక్కువ వ్యక్తులతో ఉండడం నిషేదం అని తెలిపారు.పోలీంగుకు 48 గంటల ముందు నుండే ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ఇంటింటా ప్రచారం లాంటివి చేయవద్దని పేర్కొన్నారు. ఇతర నియోజక వర్గం నుండి ప్రచారానికి వచ్చిన వాళ్లు స్థానికంగా ఏవ్వరూ ఉండకూడదని పేర్కొన్నారు.లాడ్జి లు, గెస్ట్ హౌస్ లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు, రాజకీయ పార్టీ ల వారు నేటి 5 గంటల లోపు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లాడ్జీలలో బస చేయడానికి ఎవ్వరయిన హస్పటల్ కు మరి ఏ ఇతర వ్యక్తిగత కారణాలతో వచ్చినట్లయితే వారు పూర్తి వివరాలు, గుర్తింపు కార్డులు పరిశీలించిన తర్వాత అనుమతిం చాలని తెలిపారు. వారు వచ్చిన సమయం, వెళ్లిన సమయం పూర్తి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలనని సూచించారు.మద్యం దుకాణ యాజ మానులు టోకెన్ విధానంలో పెద్ద ఎత్తున రాజకీయ పార్టీలకు, వ్యక్తు లకు మద్యం అమ్మితే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ జరిగే రోజు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అంతరాయం కలిగించే ఏదైనా మండే పదార్థాం ఉదాహరణకు టపాకాయలు లేదా ఇతర పదార్థాలను తీసుకెళ్లరాదని తెలిపారు. పోలింగ్ స్టేషన్ సమీపంలో 100 మీటర్ల పరిధిలో ఉన్న ఇండ్ల యాజమానులు బయటి వ్యక్తులను ఎవ్వరిని అనుమతించకూడదు. అలాగే పోలింగ్ స్టేషన్ సమీపంలో 100 మీటర్ల పరిధిలో ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన వారి ఇండ్ల యాజమానులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

ఓటింగ్ నేపద్యంలో నేటి సాయంత్రం 5 గంటల నుండి ఈనెల 30వ తేదీ వరకు అదే విధంగా కౌంటింగ్ రోజైనా డిసెంబర్ 3 వరకు వైన్స్ షాపులు, కల్లు దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు. నేటి నుండి డిసెంబర్ 4 ఉదయం 6 గంటల వరకు ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున, పై నిబంధనలను ఏ పార్టీవారయిన, ఏ వ్యక్తులయిన ఎవ్వరయిన ఉల్లంఘించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# పోరాటాల గడ్డ చరిత్రను మరవదు

**భువనగిరి - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాటానికి నాంది పలికిన పోరాటాల గడ్డ మొదటి ఆంధ్ర మహాసభ జరిగిన ఈ నెల పోరాటాలను చరిత్రను మరో వద్దని భువనగిరి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా పార్లమెంట్ ప్రారంభమైన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు కొమ్మిడి నరసింహారెడ్డి ఎలిమినేటి మాధవరెడ్డి కొండ లక్ష్మణ్ బాపూజీ లాంటివారు ఇక్కడ పేరెందుకు నిన్న నేతలు అని పేర్కొన్నారు వాళ్లు ప్రజల కోసమే పని చేశారని వివరించారు. అలాంటి గొప్ప నాయకులు పుట్టిన ప్రాంతంలో పైల శేఖర్ రెడ్డి వారి అడుగుజాడల్లో నడవడం లేదన్నారు. సుమారు 42 సంవత్సరాలుగా భువనగిరి నియోజకవర్గం లో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడ్డది అన్నారు బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదవాళ్లకు ఇల్లు రాలేదన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదన్నారు కొత్త పెన్షన్లు కొత్త రేషన్ కార్డులు కొత్త ఉద్యోగాలు వచ్చిన దాఖలాలు లేవు అన్నారు. పునాది గాని ధర్మారెడ్డి పిల్లాయిపల్లి కాలువలకు శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఆ కాలువలను పూర్తి చేయడంలో పైల శేఖర్ రెడ్డి నిర్లక్ష్యం వహించారన్నారు కనీసం అసెంబ్లీలో మాట్లాడి జల కాలుష్యం తో పాటు



పారిశ్రామిక వాయు కాలుష్యం ఈ ప్రాంతంలో అధికంగా ఉందన్నారు. వాటిని అరికట్టడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. వరకట్పల్లి నుండి రాయగిరి వరకు సుమారు రెండువేల ఎకరాలు రెండు వేల మంది రైతులు భూములు కోల్పోయారని తెలిపారు. రైతులకు బడిలో వేసి చరిత్ర విఆర్ఎస్ దేని అన్నారు ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతం జిల్లా కేంద్రమైనప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదన్నారు ఏరియా ఆసుపత్రిలో 100 పడకల ఆసుపత్రి మండలంలో 25 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయలేకపోయారని తెలిపారు. విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూలలో. కళాశాలలో విద్యార్థులకు కనీస టాయిలెట్ సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. భువనగిరి బస్టాండుకు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఘోరంగా విఫలమైనారని తెలిపారు. అతనికి ప్రజా సమస్యల పైన అవగాహన లేదన్నారు. బీఆర్ఎస్ కు ఎన్నికలలో బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఎప్పుడూ ఉంటానాని కుంభం అని పేర్కొన్నారు. సభలో డిసిసి అధ్యక్షులు ఆడపు సంజీవరెడ్డి పిసిసి కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్, పీసీసీ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్, చల్లగురుగుల రఘుబాబు, బెండ బాలరాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, ఈరపాక నరసింహ, పడగెల ప్రదీప్ పాల్గొన్నారు.

### దళిత బాంధవుడు

## ముఖ్యమంత్రి కేసీఆర్



**మిరు దొడ్డి - ప్రభాత సూర్యుడు:** దళిత బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్సీ పారు హుస్సేన్ , కొత్త ప్రభాకర్ రెడ్డి తనయుడు పృథ్వీ రెడ్డి లు అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి, మల్లుపల్లి గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి నీ అధిక మెజార్టీతో గెలిపించాలని ఉద్దేశంతో గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగుపల్లి గ్రామం దళిత గ్రామం కాబట్టి తప్పనిసరిగా ప్రభాకర్ రెడ్డి గెలిచిన వెంటనే ప్రతి ఇంటింటికి దళిత బంధు అందిస్తామని అన్నారు. ప్రభాకర్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించుకొని గ్రామాన్ని మరింత అభివృద్ధి విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాల్ నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు కమలాకర్ రెడ్డి, చార్వాక కుమార్, లింగుపల్లి యువకులు భాను అమర్ తదితరులు పాల్గొన్నారు.

## పదలాలిత్యం, భావసౌందర్యం లలిత సంగీతానికి ఆభరణాలు




**సుల్తాన్ బజార్ - ప్రభాత సూర్యుడు**

పదలాలిత్యం, భావ సౌందర్యం లలిత సంగీతానికి ఆభరణాలని రాష్ట్రఖజానా,గణాంకఉపసంచాలకులు జి.వసుంధర అన్నారు. నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో సుల్తాన్ బజార్ లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో ఏవీ సావిత్రి స్మారక లలిత సంగీత పోటీలను ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాన్య ప్రజల హృదయ గీతం లలిత సంగీతమన్నారు. ప్రముఖ గాయని డి. సురేఖమూర్తి మాట్లాడారు. ఆచార్య ఫణీంద్ర, డాక్టర్. నండూరి విద్యారణ్యస్వామి, ఏవీ సావిత్రి సోదరులు ఏవీ.రామారావు, నిష్టల సుధా మాల, నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తదితరు పాల్గొన్నారు

## సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో భారీ కవాతు



**పెద్దవూర - ప్రభాత సూర్యుడు:** మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కేంద్ర సాయుధ బాలాగాలు, పోలీసు సిబ్బంది తో పెద్దవూర ఎస్ ఐఅజ్మీరా రమేష్ ఆధ్వర్యంలో భారీ కవాతునిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ ఐరమేష్ మాట్లాడుతూ.. మండలం లో గేమ్యానాయక్, పులిచర్ల, పోతునూరు, నీమా నాయక్ తండా, పాల్తీ తండా, ఊరబావి తండా, ఉట్లపల్లి గ్రామాల్లో కూడా కేంద్ర బాలగాల సహకారం తో కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు. ప్రజలు స్వచ్ఛాయుత వాతావరణం లోఓటుహక్కు వినియోగించు కునేలా కవాతు నిర్వహింస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కేంద్ర సిఆర్పిఎఫ్ బాలగాలు వున్నారు.

## కాంగ్రెస్‌వి కుట్ర రాజకీయాలు

**తాండూరు- ప్రభాత సూర్యుడు :** కాంగ్రెస్ తాటకు చప్పుళ్లకు బయపడేది లేదని, ఐటీ దాడుల్లో దొరికిందేమీ లేదని తాండూర్ బీఆ ర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరులో కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు అదిరేది లేదు ..తగ్గేదే లేదని అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ తాటకు చప్పుళ్లకు బయ పడేది లేదన్నారు. ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ ప్రజ లందరూ తమకు మద్దతుగా ఉన్నారన్నారు. రాజకీ య కుట్రతో పాటు తనపై కూడా కుట్రలు చేస్తు న్నారని అన్నారు. ఎన్నికుట్రలు చెసినా అదిరేది లేదు బెదిరేది లేదన్నారు. దొంగలు ఒక్కటై లేని పోని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు.

# కెసిఆర్‌కు ఓటేస్తే నష్టపోయేది మీరే కష్టపడేది మీరే

### మాజీ ఎంపీ విజయశాంతి, మల్ రెడ్డి రంగారెడ్డి

- 6 గ్యారంటీలను మేము ఇస్తాం ఓటు గ్యారెంటీ మీరు ఇవ్వండి
- ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినవే
- తెలంగాణకు పట్టిన గ్రహణం కేసీఆర్



**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డికి మద్దతుగా రోడ్ షోలో పాల్గొన్న ఎంపీ విజయశాంతి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్వాగతం పలుకుతున్నారని అధికారంలోకి వచ్చిన తర్వాత 6 గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని తెలిపారు. . ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ, ఫీజు రియంబర్స్మెంట్, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి లక్ష రూపాయలు తులం బంగారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అవినీతి పాలన చేస్తుందని, బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు, నిరుద్యోగులకు మోసపూరితమైన వాగ్దానాలు చేస్తూ కాలం ఎల్లదిస్తుందని అన్నారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్తలు 6 గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటును అభ్యర్థించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు, గురునాథ్ రెడ్డి, గుండెమోని జయమ్మ, కౌన్సిలర్లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో

# రెండు లక్షల ఉద్యోగాలు

### కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



**పెన్ పహాడ్:** కాంగ్రెస్ హయంలోనే అందరికీ సంక్షేమం చేకూరుతుందని కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, పొట్లపహడ్, మాచారం, దుపహడ్, లింగాల, గాజులమల్కాపురం, తంగెళ్ళగూడెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో మహిళలు కోలాటాలాతో భారీ ఎత్తున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తారో వివరించారు. బీఆర్ఎస్ నాయకులు గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నాయకులను పార్టీ జెండాలు కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే నవలకుండ్ కొనారెడ్డి, టిపిసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సంధ్యారెడ్డి, వైఎస్ఆర్టిపి అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తూముల సురేష్ రావు, మాజీ జెడ్పీటీసీ పిన్నని కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు మండలి జ్యోతిపిచ్చయ్య, పద్మ శంకర్, నాయకులు అబ్దుల్ రహీం, ఎంపీటీసీ కొండేటి పవన్, నాయకులు పెద్దిరెడ్డి రాజా, నారాయణ ప్రవీణ్ రెడ్డి, మామిడి వెంకన్న, దాచేపల్లి భరత్, కుందూరు వెంకటరెడ్డి, మొండికత్తి లింగయ్య, కమ్మంపాటి రాజు, సన్ని, ఒగ్గు రవి, జుకురి అంజయ్య, జుకురీ గాంధీ, దొంగరి సైదులు, ఆర్తి కేశవులు, దొంగరి జనార్ధన్, పెదపోలు వెంకన్న, బిట్టు కోటయ్య, భూక్య సందీప్ రాథోడ్, భూక్య శివనాయక్, పెదపోలు సునీల్, పిన్నని సందీప్, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఫిర్యాదు వల్లే రైతుబంధు ఆగిపోయిందని

# హరీశ్‌రావు, కేసీఆర్ ప్రచారం చేయడం విడ్డూరం

### - డోర్నకల్ ప్రచార సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



**మరిపెడ - ప్రభాత సూర్యుడు**

రైతు బంధును అడ్డుపెట్టుకొని ఎన్నికల్లో లబ్ది పొందాలని మామ అల్లుడు చూస్తే.. ఎన్నికల కమిషన్ స్పందించి దాన్ని నిలిపివేసిందని, కాంగ్రెస్ ఫిర్యాదు వల్లే రైతుబంధు ఆగిపోయిందని హరీశ్‌రావు, కేసీఆర్ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభలో రేవంత్ మాట్లాడారు. రైతుబంధు ఇవ్వాలనుకున్నప్పుడు.. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఇవ్వొచ్చు కదా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి తెలంగాణ రైతులు ఓట్లు వేసి గెలిపిస్తే డిసెంబరు 9 తర్వాత ప్రతి రైతు ఎకౌంట్‌లో రైతుబంధు సాయం కింద రూ.15 వేలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా వేసినా వాటిలో లొసుగులతో రెండు లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో అడ్డుకుంటున్న అసలైన దొంగ కేసీఆర్ అని విమర్శించారు. ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని, మీ భవిష్యత్తును మీరే కాపాడుకోవాలని యువకులకు పిలుపు నిచ్చారు. కేసీఆర్ కుటుంబ పాలన, డోర్నకల్‌లో రెడ్యా నాయక్ అవినీతి పాలనను అంతమొందించాలని, వచ్చే ఎన్నికల్లో డాక్టర్ రామచంద్రనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డోర్నకల్, మహబూబాబాద్ అభ్యర్థులు డాక్టర్లు రామచంద్రనాయక్, మురళి నాయక్, మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు వెన్నం శ్రీకాంత్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు రాధాబాయి, మహలోతు నెహ్రూ నాయక్ పాల్గొన్నారు. జరిగింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215